## గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం


అచ్యుత్‌రావుగూడలో దగ్ధమవుతున్న ఇల్లు

కాసిపేట, డిసెంబర్ 26 : కాసిపేట మండలంలోని దేవాపూర్ అచ్యుత్ రావు గూడెంలో గురువారం రాత్రి ఆత్రం సత్తుబాయి ఇంట్లో సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఆత్రం సత్తు ఇంట్లో ఒకరే ఉండగా పని నిమిత్తం పక్క వారి ఇంటికి వెళ్లగా ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాప్తి చెంది ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగే సమయంలో మహిళ బయటకు వెళ్లడంతో ప్రాణ నష్టం తప్పింది. ఇల్లు పూర్తిగా కాలిపోగా తనకు ఉన్న ఆధారం ఇల్లు, సామగ్రి అన్ని దగ్ధమవడంతో బాధితురాలు కన్నీరు మున్నీరుతో రోధించడం అందరినీ కలచి వేసింది. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు మంటలు ఆర్పారు.

## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి, డిసెంబర్ 26 : ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం బెల్లంపల్లిలో జరిగింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీకి చెందిన కాదాసీ సిద్ధార్థ (18) ఇంటర్ మధ్యలో మానేసి పట్టణంలోని బట్టల షాపులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆ విషయం చెప్పగా ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై కాల్ టెక్స్ రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

కౌటాల, డిసెంబర్ 26 : మండల కేంద్రానికి చెందిన పిట్టల స్వాతి(22) గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. గమనించిన కుటుంబీకులు వెంటనే స్వాతిని చికిత్స నిమిత్తం సిర్పూర్(టీ)లోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. స్వాతి మృతికి గల కారణాలు తెలియరాలేదు.

## గంజాయి పట్టివేత


పట్టుబడ్డ నిందితులు

కన్నెపల్లి, డిసెంబర్ 26 : మండలంలోని టేకులపల్లి పెట్రోల్ బంకు ముందు టీ జంక్షన్ వద్ద అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం పట్టుకున్నట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు టీ జంక్షన్ వద్ద తనిఖీ చేస్తుండగా ఈజ్‌గాం గ్రామానికి చెందిన రాజు సర్కార్, శామీర్ బరాయిని పట్టుకుని తనిఖీ చేయగా వారి వద్ద 1100 గ్రాముల గంజాయి లభించిందన్నారు. నిందితులను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో మేక మృతి

కన్నెపల్లి, డిసెంబర్ 26 : మండలంలోని లింగాల పంచాయతీ పరిధిలోని నాగపెల్లికి చెందిన లాట్కరి కృష్ణయ్యకు చెందిన మేక గురువారం విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. మేక మేత కోసం వెళ్తుండగా రోడ్డు పక్కన విద్యుత్ టాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. మేక విలువ రూ.12 వేలు ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు మార్చాలని అధికారులను ప్రజలు కోరారు.

## పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, డిసెంబర్ 26 : బోథ్ మార్కెట్ పరిధిలోని జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. ఆయా జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో పత్తి నిల్వలు పేరుకుపోయిన కారణంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జనవరి 1 వరకు కొనుగోళ్లు ఉండవని వివరించారు.

## రైతుల్లో ఆందోళన

భీంపూర్, డిసెంబర్ 26 : వాతావరణ మార్పుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భీంపూర్ మండలంలో పత్తి పంట చివరి దశలో ఉండగా, కంది కోతకు సిద్ధంగా ఉన్నది. కొందరు రైతులు కంది కూడా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో అకాల వర్షం కురిస్తే అసలైన సమయంలో పంటలు నష్టపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం జేస్తున్నారు

## ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను విరమించుకోవాలి

నస్పూర్, డిసెంబర్ 26 : కస్తూర్బా పాఠశాలలలకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల డిప్యూటేషన్ ఆదేశాలను విరమించుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బాపు తెలిపారు. 18 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను చర్చలకు పిలిచి వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. కనీస వేతనాలు, బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను కస్తూర్బా పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపిస్తే విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. వెంటనే దీన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

## చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవు


చైనామాంజాపై అవగాహన కలిగిస్తున్న అధికారులు

దండేపల్లి, డిసెంబర్ 26: చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవని తాళ్లపేట డిప్యూటీ రేంజర్ సాగరిక హెచ్చరించారు. దండేపల్లి మండలంలోని తాళ్లపేట కిరాణా దుకాణాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. చైనా మాంజా దారంతో మనుషులు, పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. దీన్ని విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో రహీమొద్దీన్ ఉన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

తాండూర్, డిసెంబర్ 26 : సీఎం కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు అచ్చలాపూర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎంపికైనట్లు పీడీ ఏ సాంబమూర్తి తెలిపారు. ఈ నెల 23న డీవైఎస్‌వో గ్రౌండ్ మంచిర్యాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో మంచిర్యాల జట్టు మొదటి స్థానం కైవసం చేసుకున్నది. తాండూర్ మండలం అచ్చలాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం అమూల్య మంచిర్యాల జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించి అంత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి 30 వరకు ఖమ్మం జిల్లాలో జరుగబోయే సీఎం కప్ రాష్ట్రస్థాయి బాల బాలికల వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బీ ఉమాదేవి, ఉపాధ్యాయులు, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణి రాజా, అచ్చలాపూర్ గ్రామ పెద్దలు అభినందించారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి సాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న అంజనీపుత్ర ఆటో యూనియన్ నాయకులు

కాసిపేట, డిసెంబర్ 26 : కాసిపేట మండలంలోని కోమటిచేను గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాంటెంకి లక్ష్మణ్ ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి తోటి ఆటో డ్రైవర్లు తమ వంతు సహాయం చేసి ఔదార్యాన్ని చాటారు. ఆటో డ్రైవర్లు, ఓనర్లు కలిసి రూ.17000 నగదును కోమటిచేనులోని లక్ష్మణ్ ఇంటికి వెళ్లి ఆర్థికసాయాన్ని అంజనీపుత్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు అందించారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## గంగపుత్ర సంఘం అభివృద్ధికి కృషి

బెల్లంపల్లి, డిసెంబర్ 26 : బెల్లంపల్లి పట్టణ గంగపుత్ర సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని గంగపుత్ర సంఘం బెల్లంపల్లి పట్టణ కన్వీనర్ మునిమంద రమేశ్ స్పష్టం చేశారు. గురువారం బెల్లంపల్లి పట్టణం బూడిదగడ్డ బస్తీలోని ఆయన నివాసంలో 2025 గంగపుత్ర సంఘం క్యాలెండర్‌ను పట్టణ అధ్యక్షుడు వంగల చక్రపాణి, జిల్లా నాయకులు బాసబోయిన పోతరాజు, దామెర సదానందం, కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గరిగే రాజ్ కుమార్, మునిమంద సత్యనారాయణ, ముద్రగడ గోపాల్, ముద్రగడ వెంకటి, పెద్దపల్లి లక్ష్మణ్, తాడబోయిన రవి తదితరులున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలి


మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ

మందమర్రి, డిసెంబర్ 26: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ కోరారు. మందమర్రి పట్టణంలోని గ్రేస్ లిటిల్ ఆర్ట్స్ పాఠశాల సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, స్థానిక సంస్థల నుంచి చట్ట సభల వరకు దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని, ఇందిరమ్మ ఇండ్లలో కూడా ఐదు శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2016 చట్టాన్ని అన్ని శాఖలు అమలు చేయాలని పూర్తిగా నడవ లేని దివ్యాంగులకు రూ.15 వేల పింఛన్ చెల్లించడంతో పాటు మూడు చక్రాల వాహనాలు ఇవ్వాలని కోరారు. ఉచిత బస్సు, రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్‌ను ఆరు వేలకు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో దివ్యాంగులకు ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు బీవీ.అప్పారావు, ఇందూరి రమేశ్, దుర్శెట్టి లక్ష్మణ్, రామ్ శ్రీనివాస్, రాంటెంకి సుధాకర్, తోట తిరుపతి, షేక్‌రావు, నరేశ్, దేవి ప్రకాశ్, రాజశేఖర్, జిల్లా మహిళా నాయకులు బానోతు సుశీల, ధనలక్ష్మి, భీమేశ్వరి, ప్రశాంతి, లక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

మందమర్రి, డిసెంబర్ 26: గోలేటి నుంచి మందమర్రి ఏరియాకు బదిలీపై వచ్చిన సింగరేణి ఎస్ అండ్ పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మల్లారెడ్డిని సెక్యూరిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఓ రవి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రమేశ్, జూనియర్ ఇన్స్‌పెక్టర్ చంద్రమౌళి, కేంద్ర కమిటీ సభ్యుడు కేజే.చారి, పిట్ కార్యదర్శి కేఆర్.సంపత్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి చంద్రగిరి మురళి, ఎస్ అండ్ పీసీ జమేదార్‌లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

- కలెక్టర్ కుమార్ దీపక్
- ముగిసిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బేస్‌బాల్ పోటీలు


గెలుపొందిన మహిళా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

తాండూర్(బెల్లంపల్లి), డిసెంబర్ 26 : క్రీడలు ప్రతి ఒక్కరూ శారీరకంగా మానసికంగా ధృఢంగా ఉండేందుకు దోహదం చేస్తాయని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ మైదానంలో నిర్వహిస్తున్న 9వ జాతీయ సాఫ్ట్‌బేస్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భవిష్యత్‌లో ముందుకు వెళ్లేందుకు క్రీడలు క్రమ శిక్షణను సైతం పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సైతం వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం పోటీల్లో విజేతలైన సబ్ జూనియర్ బాలురు, బాలికల విభాగాల్లో కేరళ, యూత్ మహిళ, పురుషుల విభాగంలో కేరళ జట్లు విజేతగా నిలిచాయి. గెలిచిన జట్లకు కలెక్టర్ ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బేస్‌బాల్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి గురువేందర్, ట్రెజరర్ దివాకర్, జిల్లా త్రో బాల్ సెక్రటరీ యాదండ్ల బలరాం, నాయకులు నాతరి స్వామి, మునిమంద రమేశ్, వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.


**విజేతగా కేరళ జట్టు..**

9వ జాతీయస్థాయి సాఫ్ట్‌బేస్‌బాల్ పోటీల్లో సబ్ జూనియర్ బాలుర విభాగంలో మొదటి స్థానంలో కేరళ, రెండవ స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో తెలంగాణ నిలిచింది. సబ్ జూనియర్ బాలికల విభాగంలో మొదటి స్థానంలో కేరళ, రెండవ స్థానంలో తెలంగాణ, మూడో స్థానంలో మధ్యప్రదేశ్ జట్లు నిలిచాయి. యూత్ పురుషుల విభాగంలో మొదటి స్థానంలో కేరళ, రెండవ స్థానంలో తెలంగాణ, మూడో స్థానంలో మధ్యప్రదేశ్ జట్లు నిలిచాయి. యూత్ మహిళా విభాగంలో మొదటి స్థానంలో కేరళ, రెండవ స్థానంలో తెలంగాణ, మూడో స్థానంలో మధ్యప్రదేశ్ జట్లు నిలిచాయి.


అన్ని విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన కేరళ జట్టు

# అక్రమంగా ఇసుక తవ్వకాలు

- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్


మత్తడి ఒర్రె నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలింపు

వేమనపల్లి, డిసెంబర్ 26 : వేమనపల్లి మండలం ఒడ్డుగూడెం అటవీ ప్రాంతంలోని మత్తడి ఒర్రెలో గురువారం అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణానికి సదరు కాంట్రాక్టర్ ఒర్రెలో నుంచి జేసీబీ ద్వారా ఇసుకను తీసి ట్రాక్టర్లలో నింపి కాలువ నిర్మాణానికి తరలిస్తున్నాడు. దీంతో కొందరు గ్రామస్తులు ఫొటోలు తీసి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. రెండు రోజుల నుంచి ఈ ఒర్రె నుంచి పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండే ఈ ఒర్రె నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కుష్నపల్లి ఎఫ్ఆర్వో దయాకర్‌ను వివరణ కోరగా ఈ విషయం దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

తాండూర్, డిసెంబర్ 26 : తాండూర్ మండల పరిధి రేపల్లెవాడ సమీపంలో కుమ్రం భీం జిల్లా రెబ్బెన మండలం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి పట్టుకున్నారు. వాటిని తాండూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# స్టేషన్ పెద్దనపల్లిలో కార్డెన్ సెర్చ్


మాట్లాడుతున్న మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి

కాసిపేట, డిసెంబర్ 26 : కాసిపేట మండలంలోని స్టేషన్ పెద్దనపల్లిలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో కాసిపేట, మందమర్రి, రామకృష్ణాపూర్, దేవాపూర్ ఎస్ఐలు, సిబ్బంది, నార్కోటిక్ డాగ్, సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఉంటున్నారా?, అపరిచిత వ్యక్తులకు ఇక్కడ ఎవరైనా షెల్టర్ ఇస్తున్నారా ? అనే కోణంలో విచారిస్తూ ప్రతి ఒక్కరి ఆధార్ కార్డ్, గుర్తింపు కార్డు పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోల ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని, నంబర్ ప్లేట్ లేని 27 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను గుర్తించి వాటికి అక్కడికక్కడే జరిమానా వేసి సరి చేశారు. 3 నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలు, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, మందమర్రి, రామకృష్ణాపూర్ ఎస్ఐలు, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ పాల్గొన్నారు.

# అయ్యో 'పాప'ం

- డంప్‌యార్డుకు చెత్త తరలిస్తుండగా వాహనం నుంచి పడిపోయిన నవ జాత శిశువు మృత దేహం
- కేసు నమోదు చేసిన పోలీసులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 26 : కన్నతల్లి ఒడిలో ఉండాల్సిన ఓ నవజాత శిశువు.. ఆ ప్రేయకు దూరమై, చెత్తకుండీలో శవమైకనిపించింది. ఈ హృదయ విధారక ఘటన నిర్మల్‌లో చోటు చేసుకున్నది. నిర్మల్ పట్టణంలో డాక్టర్స్ లేన్‌లోని చెత్త తీసుకువెళ్లే మున్సిపల్ సిబ్బంది.. రోజువారీగా గురువారం సైతం ఆటోలో చెత్త సేకరించారు. స్థానిక బంగల్‌పేట్ కాలనీలోని డంప్‌యార్డుకు తరలించే క్రమంలో ఆటోలో నుంచి ఓ కవర్ కింద పడిపోయింది. గమనించిన ఆటో డ్రైవర్ వాహనాన్ని ఆపి కవర్ తెరిచి, చూడగా నవజాత శిశువు(పాప) మృత దేహం కలిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందిచడంతో వారు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి


నిర్వాహకులతో మాట్లాడుతున్న డీపీఎం వేణుగోపాల్

దండేపల్లి, నవంబర్19: ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని డీపీఎం వేణుగోపాల్ అన్నారు. దండేపల్లి మండలంలోని కన్నెపల్లి, గూడెం, వెల్గనూర్, నంబాల, కాసిపేట, కొండాపూర్, మాదాపూర్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల నిర్వహకులకు పలు సూచనలు అందించారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం బ్రహ్మయ్య, ఆర్ఐ భూమన్న, సీసీలు, నిర్వాహకులున్నారు.

# సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవం


నస్పూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నేత కలవేని శంకర్

సీసీసీ నస్పూర్/కాసిపేట/తాండూర్, రెబ్బెన, డిసెంబర్ 26: బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం సీపీఐ పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ తెలిపారు. గురువారం నస్పూర్‌లో పార్టీ శత ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరికాలనీ షిర్కె చౌరస్తాలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్, నస్పూర్‌లో మిర్యాల రాజేశ్వర్‌రావు, నాగార్జునకాలనీలో కంచం పోశం పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 30న నల్గొండ జిల్లాలో భారీ బహిరంగ సభ, ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెలలో 29న నస్పూర్‌లోని అబ్రహం భవన్ నుంచి ర్యాలీ తీయనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాసిపేటలో సీపీఐ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు దాగం మల్లేశ్ జెండా ఎగురవేశారు. తాండూర్ మండలంలోమాదారంలో సీపీఐ జెండాను ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యా మొగిలి ఆవిష్కరించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామంలోని కేఎల్ మహేంద్రభవన్‌లో వేడుకలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు.


రెబ్బెన : గోలేటిలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రీసత్యనారాయణ

## కాలువలకు మరమ్మతు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

రెబ్బెన, డిసెంబర్ 26: వట్టివాగు ప్రాజెక్టు కాలువలకు మరమ్మతు చేయించి రెబ్బెన మండలంలోని రైతులను ఆదుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కి వినతిపత్రం అందించినట్లు పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు కార్నాథం వెంకటేశం, బొమ్మినేని శ్రీధర్, వడై పోశం, దుర్గం భరద్వాజ్, తక్కలపల్లి రాజేశ్వర్‌రావు, ఉబేదుల్లా పలువురు ఉన్నారు.

## అన్నదానం చేసిన ఎమ్మెల్యే దంపతులు


అయ్యప్ప స్వాములకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 26: జిల్లా కేంద్రంలోని పెద్ద వాగు ఒడ్డున గల శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం మండల పూజ శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి, సోనేరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించి భక్తులకు భోజనం వడ్డించారు.

## బాక్సింగ్‌తో శరీర దారుఢ్యం పెంపొందుతుంది


బహుమతులు అందిస్తున్న సీఐ రాజేంద్రప్రసాద్

కాగజ్‌నగర్, డిసెంబర్ 26: బాక్సింగ్‌తో మానసికోల్లాసంతో పాటు శరీర దారుఢ్యానికి ఎంతో మేలు చేస్తాయని పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని ముత్తు మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బాక్సింగ్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడా ఆత్మస్థైర్యం, ఆత్మ రక్షణకు తోడ్పడుతుందన్నారు. బాక్సింగ్‌లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ శివకుమార్, ప్రధానకార్యదర్శి మధురై శేఖర్ మాస్టర్, కోశాధికారి రమాకాంత్ యాదవ్, ఉపాధ్యక్షుడు జయేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రగ్‌జోల్ యాత్ర


జ్యోతిబాపూలే, గాంధీజీ విగ్రహాలకు పూలమాల వేస్తున్న నాయకులు

కెరమెరి, డిసెంబర్ 26: బంజారా, లంబాడాల హక్కులు, ఐక్యత కోసం చేపట్టిన రగ్‌జోల్ యాత్ర గురువారం కెరమెరిలో చేపట్టారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్రాంతంలో ఉన్న జ్యోతిబాపూలే, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు మాట్లాడుతూ లంబాడాలను జాగృతపరుస్తూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పాటు పడాలనే ఉద్దేశంతో యాత్ర కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రవి నాయక్, జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్, నాయకులు శంకర్ నాయక్, వెంకటి నాయక్, తిరుపతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు రోజులు టీజీబీ సేవలు బంద్

వాంకిడి, డిసెంబర్ 27: ఈ నెల 28 నుంచి 31 వ తేదీ వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు నిలిపివేయనున్నట్లు రీజనల్ మేనేజర్ ప్రభుదాస్, వాంకిడి బ్రాంచ్ మేనేజర్ జాడి కృష్ణ గురువారం తెలిపారు. రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖలు 2025వ సంవత్సరం నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్నందున టీజీబీ బ్యాంకు పరిధిలోని లావాదేవీలు నిలిపివేస్తామని తెలిపారు. శాఖలు,వ్యవస్థల సులభ విలీనం కోసం శాఖా కార్యకలాపాలు, ఏటీఎం, యూపీఐ పేమెంట్స్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, బ్యాలెన్స్ ఎంక్వైరి మొదలగు ఆన్లైన్ బ్యాంకింగ్ సేవలు, ఖాతాదారుల సేవా కేంద్రాలు(సీఎస్పీ) 28 నుంచి 31వ తేదీ వరకు అందుబాటులో ఉండవని పేర్కొన్నారు. ఖాతాదారులు సహకరించి ముందస్తు లావా దేవీలు చేసుకోవాలని కోరారు. బ్యాంకు సేవలు తిరిగి జనవరి 1 నుంచి పునఃప్రారంభిస్తామని తెలిపారు.

## విలీనసభ ను విజయవంతం చేయండి


విలీనసభ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

రెబ్బెన, డిసెంబర్ 26: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న నిర్వహిస్తున్న సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రెండు పార్టీల విలీనసభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ, జిల్లా, డివిజన్ నాయకులు బండారి తిరుపతి పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్ లో గురువారం రెండు పార్టీల విలీనసభ పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోలేటి శ్రీనివాస్, పోచం, లింగయ్య, నాగలక్ష్మి, శంకరమ్మ, భీమేశ్, నరేశ్, కమల, సునీతతో పాటు పలువురు ఉన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరి మృతి

భైంసా టౌన్, డిసెంబర్ 26 : మండలంలోని వానల్‌పాడ్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుంటాల మండలం విట్టాపూర్‌కు చెందిన ఏలేటి ఇంద్రారెడ్డి (35) మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రారెడ్డి బైక్‌పై భైంసాకు వస్తుండగా, వానల్‌పాడ్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు.